కథానిక

# ఋణానుబంధం

'రాజు'

'నాన్న' పేరు పిల్లాడి హృదయంలో నాటుక పోయింది. నాన్నంటే పెద్ద దైవం. ప్రపంచంలో నాన్నంత మంచివాడు లేడని పిల్లవాడు ఉబలాట పడేవాడు. తన కిప్రపంచంలో నాన్న తప్ప మరో అండలేదని పిల్లవాడు అనుకొనేవాడు.

నాన్న హృదయం నిర్మలంగా ఉండేటప్పుడు, నాన్న పిల్లాడిని చేరదీసి మంచి మంచి కథలు చెప్పేవాడు. ఆకథలు వింటూ పిల్లాడు నిద్ర పోయేవాడు.

పిల్లాడు నాన్నను ఎంతో ప్రేమించేవాడు.

నాన్నని 'జీవితజ్యోతి' అని తలచేవాడు. కాని నాన్నమాత్రం పిల్లాడి ప్రేమను సరిగా అవగాహన చేసుకోలేక పోయేవాడు. 'ఆ సమయంలో' మాత్రం నాన్న పిల్లాడి నొక పరమ శత్రువుగా చూసేవాడు.

నాన్న తలంపు కొద్దికాలం మాత్రమే. తరువాత పిల్లాడు తన ఆశాజ్యోతి అని వలవల ఏడ్చేవాడు. నాన్న నిజంగా ఎంతో ప్రేమించేవాడు. కాని ఆ నిషావల్ల తల తిరిగిపొయ్యేది. లేకలేక పుట్టిన మగసంతానం. భార్య చనిపోయిం దగ్గర నుంచి ఆ పిల్లాడికి తల్లి, తండ్రి సర్వం తనే.

భార్య పోయిం దగ్గరనుంచి నాన్న అదోలా ఉండేవాడు. తను తెచ్చే ఆదాయాన్ని దాచే దిక్కులేక ఆ కల్లుకొట్లలో అప్పు జెప్పేవాడు. ఇంటికివచ్చి పిల్లాడిని చావ బాదేవాడు.

పిల్లాడి సుఖంకోసం సర్వం ధారపోస్తానంటాడు. కాని పిల్లల్ని లాలించేమార్గం తెలియని నాన్న, పిల్లాడి కోర్కెల్ని సక్రమంగా తీర్చలేక పోయేవాడు. ఆ సమయంలో మాత్రం ముందు వెనుకలు తెలియని నాన్న పిల్లాడిని చావ బాదుతాడు. నిషా తిరిగిన తర్వాత పిల్లాడి దుఃఖాన్ని చూచి క్రుంగి కృశించిపోతాడు.

కోపంవస్తే శిలకంటె కఠినుడవుతాడు. నాన్న తాగివస్తే పిల్లాడు నాన్నదగ్గరకు చేరడానికి భయపడతాడు. ఎర్రగా నిప్పుల్లా మెరసే కళ్ళల్లో పిల్లాడికేదో క్రౌర్యం గోచరిస్తూ ఉంటుంది. నాన్న తాగినరోజు పిల్లాడికి ప్రాణసంకటమే. నిషా తిరిగిన తర్వాత పడుకొన్న పిల్లాడి మృదుశరీరం, మీద కందిన దెబ్బల్ని చూచి తనంత దుర్మార్గుడు పాపి, క్రూరుడు,కఠినుడు లేడని కన్నీరు కారుస్తాడు.

ఈ త్రాగుడువల్లే కోపం ఎక్కువౌతుందని త్రాగుడు తాగనని ఎన్నోశపథాలు చేసేవాడు. రెండురోజులే మాట నిలబెట్టుకోవడం తరువాత తాగేవాడు... బుద్ధు... ఎన్నోబుద్ధు.

౨

ఒకరోజు సాయంత్రం దారి పొడుగునా పిల్లాడి భవిష్యత్తును గూర్చి తలపోస్తు వస్తున్నాడు నాన్న. తన కొడుకు దేశభక్తుడైతే ఆ గొప్ప తనకే కూడ చెందుతుందని, సాహిత్యవేత్త అయితే ఆ గౌరవం తనకే వర్తిస్తుందని, కళారాధకుడైతే కళారాధకుని తండ్రి నవుతా గదా అని అనుకొంటు వస్తున్నాడు.

'ఆ స్థలాన్ని' చేరేసరికి కాళ్ళుసాగలేదు. అంగాలన్నీ హఠాత్తుగా ఆగిపోయినై. అంతరంగంలో ఘోరసమరం జరుగుతోంది.

'ఛీ! నీ అల్పసంతుష్టికోసం నీ కొడుకు భవిష్యత్తును నాశనంజేస్తావా? నీభార్య పోయిన తర్వాత నీవు ఆపిల్లాడికి తండ్రివేగాక మాతృశ్రీవి కూడ అయ్యావు. నీకు హృదయం ఉందా? నీ చేతులలో నీపిల్లాడి రక్తాన్ని తీసి తాగుతావా?' అంటుంది అంతరంగం.

కాని అంతరంగానికి సాయం చేయలేక పోయాడు. గతాన్ని స్మరించలేక పోయాడు. న్యాయాన్యాయాల్ని గుర్తించలేక పోయాడు. లోపల ప్రళయం చెలరేగింది.

పోగాలం దాపిస్తే ప్రతి ప్రాణీ అంతే. అంతరంగంలో రెండు విరుద్ధశక్తు లెల్లపుడు పోట్లాడుతుంటాయి. దుష్కార్యాలు చేసేటప్పుడు దైవశక్తికి బలం తగ్గుతుంది. మనస్సు యుక్తాయుక్తాల్ని స్మరించలేదు. కళ్లు వాటంతటవే మూసుకపోతవి. శరీరంలో ప్రతి అణువు దుష్టశక్తికే బలాన్ని కలిగిస్తుంది—దాంతో సరి. మైమరచి కల్లుపాకలో దూరాడు. ఒకటి, రెండు, మూడు-ముంతలు కాళీ.

రాత్రి నాన్న యిల్లు చేరుకొనేసరికి పది గంటలైంది. పిల్లాడు నాన్నకోసం చూసిచూసి నిస్సారంగా చాపమీద పడుకొన్నాడు.

'—ఏయ్' అంటూ తలుపుతెరచుకొని లోపలికి వచ్చాడు.

'రాం...రాం...ఎక్కడరా' అని తూలుతూ గర్జించాడు.

పూరిగుడిసెలో ఓమూల చిన్న దీపం నిశ్శబ్దతను కపలాకాస్తుంది. రాత్రిని మెరుగు వెడుతుంది మంచుతెర—బయట.

మళ్ళీ గర్జించాడు.

కుర్రాడు లేచాడు.

' నాన్నా !' అని పిచ్చికేకవేశాడు.

'ఎవడు ?...ఎక్కడ ?...నాన్నెవడు ?...'

పిల్లాడు మాట్లాడలేదు. నాన్నదగ్గర కొచ్చాడు.

'అరే ! ... ఎవరంటె ... మాట్లాడవేం ! ... నసుకుతావేం ?...దొంగవా ?'

'నాన్నా !'

'నోర్మూయ్ !...ఎవడవ్ ?... ఓహో ! నువ్వట్రా ?...నాడబ్బు కాజెయ్యడానికి...నా...నా...నాడబ్బు తినాలని నావెనకాల...వచ్చావా? ...పోయ్ ! మరో...మరో ముంత...నా డబ్బు తీరే వరకు...నా ప్రాణం ఉన్నంతసేపూ !... పోయ్‌రా...'

' నాన్నా '

' నాన్న ! ..నాన్నెవడు ?...ఓస్...నువ్వా! హాహాహా ... నువ్వట్రా...ఎక్కడున్నావ్... మాటాడవేం ?...నువ్వు...నువ్వు...నువ్వు నేర్చుకొన్నావా ?...తాగడం ?'

' లేదు నాన్నా ' కంపించే కంఠం నుంచి వచ్చాయ్ మాటలు.

' నోర్మూయ్ '

తన ముందు గజగజ వణకుతున్న చిన్నవాణ్ణి చేత్తో లాగి బయటకు విసరేశాడు.

' పోయింది...శని...పో ' అని తలుపు వేసుకొన్నాడు.

' నా – న్నా ' అంతే వినబడింది.

నాన్న నిషావల్ల తలతిరిగి కూలబడ్డాడు.

అర్థరాత్రి...నాన్న లేచాడు...నగరం మాటు మణిగింది, అనంతదూరంనుంచి చుక్కలు నవ్వుతున్నై. నాన్నంటె మంచుకికూడ భయమే. వెనక్కి తగ్గుతుంది.

లేచి చూసుకొనేసరికి పక్కన పిల్లాడులేడు. గుడిసె అంతా వెదకాడు...తలుపుతీసి బయటకు వచ్చాడు. నాన్న కంటె ఘోరంగా కనిపించింది నాన్న చేతిలోని దివ్వె. బయకు వచ్చి రావడంతో నాన్న కాలికి ఏదో తడి తగిలింది.

' రాం...వర్షంలో ఎక్కడకు పోయావు నాన్నా !'

నాన్న నెత్తుర్ని వెర్రి వర్షమని భావించాడు.

మరో కాలి కేదో మెత్తగా తగిలింది. దీపశిఖ పెద్దది చేశాడు.

చేతిలోని దీపాన్ని ఏదో తన్నింది. నీలిమేఘం లోంచి మంచు తెరని ఛేదించుకొంటువచ్చి ఓ మెరుపు నాన్న కంటిలోపడింది...తన జీవితానికి నూతన తేజస్సు నివ్వబోయే మణిహారం, భవిష్యత్ సాహిత్యవేత్త, దేశభక్తుడు, కళారాధకు డని తలచిన చిన్నారి చిన్న, తన అంధత్వానికి నూతన తేజస్సును ఇవ్వవలసిన దివ్యజోతి.

' రాం ' అని పడిపోయాడు పిచ్చి నాన్న.

నెత్తురులో చిరునవ్వుతో తేలియాడుతున్న కుర్రాడి భౌతిక దేహంమీద పడిన పిడుగా - ఆ నాన్న ఏడుపు. లేక శూన్యాన్ని చిరునవ్వుతో లాలిస్తున్న చిన్నాడి మీద ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధపు ఘీంకార మా అది.

కేకతో కలకత్తానగరం కంపించి పోయింది.

ఉన్నత శిఖరాలకు తగిలి బ్రద్దలై మేఘాలు ద్రవించి ప్రవహించిన అశ్రు స్రవంతా ఆనాన్న బాష్పధార.

' నాన్న ' అని ఇక తన్నెవరు పిలుస్తారు.

రాత్రిళ్ళు ఎవర్ని తిడతాడు.

తన కోపాని కెవరిక గురి అవుతారు.

' నాన్న ' అని తన్నెవ రంటారు,